సాక్షి శ్రీకాకుళం
మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



ఈ-ఐ కేంద్రాలకు తాళాలు

సీహెచ్‌సీలోని ఈ-కేంద్రాలకు ప్రభుత్వం తాళాలు వేసింది. నిరుపేదలకు నేత్ర వైద్య సేవలు దూరమయ్యాయి. -8లో



రైలు ప్రమాదంలో..

పొట్టకూటి కోసం వలస వెళ్తున్న వ్యక్తికి మృత్యువు ఎదురైంది. రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. -8లో

మహిళా కళాశాలలో 'పబ్లిక్ ఫైనాన్స్' సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో సోమవారం పబ్లిక్ ఫైనాన్స్ పేరిట సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. ఈ కోర్సును బీఏ 5వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థినులకు ఏర్పాటు చేశారు. ఈ కోర్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ పబ్లిక్ ఫైనాన్స్ సర్టిఫికెట్ కోర్సు బీఏ విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కోర్సును రూపొందించిన ఎకనామిక్స్ విభాగం అధ్యాపకులను అభినందించారు.

న్యూస్‌రీల్

జాతర ఘనంగా చేద్దాం


గ్రామపెద్దలతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: అక్టోబర్ 1 నుంచి 3 వరకూ కోటబొమ్మాళిలో జరగనున్న రాష్ట్రస్థాయి కొత్తమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించేలా గ్రామపెద్దలు, అధికారులు కృషి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించి జాతరపై పలు సూచనలు చేశారు. తాగునీరు, ఉచిత ప్రసాదం, క్యూలు, భక్తులకు బస్సు సదుపాయాలపై దృష్టి పెట్టాలన్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మీ కోసంలో నమోదైన సమస్యలను త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(మీకోసం)లో ఆయన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర-2047 వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ లక్ష్మణ మూర్తి, డీపీఓ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ వెంకట్రామన్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.మీనాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ఆర్‌వీ ప్రసాద రావు, బీసీ కార్పొరేషన్ ఈడీ గెడ్డెమ్మ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతి శ్రీ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 85 వినతులు


బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం ఎస్పీ గ్రీవెన్స్‌కు అత్యధికంగా వినతులు వచ్చాయి. గత రెండు వారాలుగా గ్రీవెన్స్ రద్దు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర జ్వరంతోనే ఎస్పీ మహేశ్వరరెడ్డి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు.

టెక్కలి మైన్స్ ఏడీగా విజయలక్ష్మి

టెక్కలి: టెక్కలి మైన్స్ ఏడీగా బి.విజయలక్ష్మిను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మైన్స్ కేంద్ర కార్యాలయం నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఫణిభూషణ్‌రెడ్డిని రాజమండ్రి డీఎంజీఓ కార్యాలయానికి బదిలీ చేశారు.

వెండి వర్తకుల్లో రికవరీ భయం

నరసన్నపేట: రణస్థలం సర్కిల్ పరిధిలో జరిగిన చోరీలకు సంబంధించి వెండి రికవరీకి జేఆర్‌పురం పోలీసులు నరసన్నపేట రావడంతో వెండి వర్తకులు హడలిపోయారు. పట్టుబడిన దొంగలు తెలిపిన సమాచారం మేరకు నరసన్నపేటలోని ఓ వెండి వర్తకుని షాపులో సోమవారం జేఆర్‌పురం సీఐ, ఎస్‌ఐలు సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. గడిచిన రెండేళ్లుగా దొంగలతో సంబంధాలు పెట్టుకొని పెద్ద మొత్తంలో వెండిని నరసన్నపేట వ్యాపారులు కొన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంట్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం నుంచి పోలీసులు సోదాలు చేయగా వెండి వ్యాపారులు పోలీసు స్టేషన్‌కు వచ్చి రాజీ సంప్రదింపులు చేశారు. దొంగలు ఇచ్చిన వివరాల మేరకు రెండేళ్లలో దఫదఫాలుగా 150 కేజీల వెండిని కడ్డీల రూపంలో నరసన్నపేట వ్యాపారులు కొన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రికవరీ చేయడానికి పోలీసులు ప్రయత్నాలు చేయగా వ్యాపారులు 50 కిలోల వెండి ఇవ్వడానికి అంగీకరించినట్లు సమాచారం. అయితే కనీసం 90 కిలోల వెండి అయినా రికవరీ కావాలని పోలీసులు పట్టుబట్టడంతో సంప్రదింపులు రాత్రి వరకూ కొనసాగాయి. సాయంత్రం వరకూ నరసన్నపేటలో ఉన్న వ్యాపారులు 8 గంటల తర్వాత ఎచ్చెర్ల వెళ్లి సంప్రదింపులు చేసినట్లు సమాచారం. కాగా రికవరీ భయంతో వెండితో పాటు బంగారం వ్యాపారులు తమ షాపులకు నరసన్నపేటలో మధ్యాహ్నం నుంచి తాళాలు వేశారు.

అక్రమంగా తరలిపోతున్న గ్రావెల్


ఆనమిత్ర టౌన్ షిప్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్


కొండ మీద ఇళ్లు ఉన్నప్పుడు.. కొండ కింద తవ్వితే ఆ ఇళ్లకు ప్రమాదం వాటిల్లుతుందని ఎవరికైనా తెలుస్తుంది. కానీ ఎస్ఎం పురం ఆనమిత్ర కాలనీలో మాత్రం అక్రమార్కులకు ఆ మాత్రం కనికరం లేకపోయింది. అనుమతులు తీసుకోకుండా, అడ్డూ అదుపు లేకుండా ఇష్టానుసారం గ్రావెల్ తరలించుకుపోతున్నారు. ఎస్ఎంపురంలోని ఆనమిత్ర టౌన్ షిప్ రాజీవ్ స్వగృహ కాలనీకి ఆనుకుని గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. పొక్లెయినర్లతో టిప్పర్లకు లోడ్‌చేసి తరలిస్తున్నారు. ప్రైవేట్ బిల్డర్లు, స్థానిక కూటమి నాయకులు కుమ్మక్కై ఈ అక్రమ గ్రావెల్‌ను రవాణా చేస్తున్నారు. ఎస్ఎం పురం కొండ సర్వే నంబర్ 112లో ఈ అక్రమ గ్రావెల్ తరలింపు సాగుతోంది. వాస్తవానికి ఈ స్థలం రాజీవ్ స్వగృహ కాలనీ పరిధిలో ఉంది. కొండ మీద ఆనమిత్ర టౌన్ షిప్ నిర్మాణాలు ఉన్నాయి. ఈ గ్రావెల్ తరలింపు వల్ల కాలనీకి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అయినా అధికారులు స్పందించడం లేదు. గతంలో కొండ చదును చేసి లేఅవుట్ వేసి ఇక్కడ రాజీవ్ స్వగృహ నిర్మాణాలు చేపట్టారు. దీంతో లూజ్‌గా గ్రావెల్ అందుబాటులో ఉంది. ఇక్కడ అనుమతులు ఇచ్చేందుకు సైతం అవకాశం లేదు. కొండ కింద ప్రాంతంలో అక్రమ గ్రావెల్ తరలించటం, మీద ఆనమిత్ర టౌన్ షిప్ నివాసాలు ఉండటంతో ఇళ్లల్లో ఉన్నవారు ఆందోళన చెందుతున్నారు. అక్రమ తరలింపు అడ్డుకోవాలని వీరు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

మళ్లీ మద్యం సిండికేట్!

మంత్రి సోదరుడే రింగ్‌మాస్టర్



- మళ్లీ లిక్కర్ దందా చేసే దిశగా అడుగులు
- మద్యం షాపుల ఏర్పాటులో చక్రం తిప్పుతున్న ఓ మంత్రి సోదరుడు
- ఎవ రెక్కడ షాపులు పెట్టాలో, సిండికేట్ సభ్యులను డిసైడ్ చేస్తున్నది ఈయనే
- కొత్త పాలసీని సొమ్ము చేసుకునే పనిలో తమ్ముళ్లు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో మళ్లీ లిక్కర్ దందా మొదలుకానుంది. 2014–19 మధ్య విశృంఖలంగా జరిగినట్టుగానే ఈ సారి కూడా గట్టిగా దోచుకోవాలని పకడ్బందీగా అధికార నేతలు ప్లాన్లు వేస్తున్నారు. మరో రెండు రోజుల్లో పాలసీ కమ్ నోటిఫికేషన్ రానుండగా, ఈలోపే లాబీయింగ్ జరుగుతోంది. ఓ మంత్రి సోదరుడు, గతంలో లిక్కర్ బిజినెస్‌లో రాటు దేలిన ప్రసాద్, రమేష్, హరి తదితరులు చక్రం తిప్పుతున్నారు. ఎక్కడెక్కడ ప్రైవేటు మద్యం దుకాణం వస్తుంది? ఏ దుకాణానికి ఎవరు దరఖాస్తు చేయాలి? చెప్పినట్టుగానే దరఖాస్తులు పడాలి? లాటరీలో అనుకున్న వారే ఉండాలి? లాటరీలో వచ్చిన దుకాణాన్ని ఎవరు నడపాలి? దాంట్లో ఎవరెవరిని సిండికేట్‌గా ఉంచాలి? తదితరవన్నీ డిసైడ్ చేసే పనిలో పడ్డారు. ఆ మంత్రి సోదరుడే అన్నీ తానై చూసుకుంటున్నారు.

2014–19 పరిస్థితులు పునరావృతం

2014–19 మధ్య కాలంలో టీడీపీ మద్యం పేరుతో భారీగా వ్యాపారం చేసింది. వారు నిర్ణయించే ధరకే మందుబాబులు కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. చెప్పాలంటే మద్యం వ్యాపారం ఓ మాఫియాలా జరిగేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రైవేటు మాఫియాకు తావులేకుండా, ప్రభుత్వమే మద్యం దుకాణాలను నడిపింది. కొందమందికి ఉపాధి కల్పించి, వారి ద్వారా నిర్దేశిత సమయాల్లో విక్రయించింది. మద్యం ఏరులా ప్రవహించకూడదని పరిమిత షాపులు పెట్టింది. కానీ మళ్లీ పరిస్థితులు మారబోతున్నాయి. ప్రైవేటు దుకాణాలు వస్తే తప్పనిసరిగా బెల్ట్ షాపులు వస్తాయి. ఎంత విక్రయిస్తే అంత లాభాలు వస్తాయని దుకాణాలను దక్కించుకున్నవారే బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తారు. మొత్తానికి విచ్చలవిడితనం పెరగనుంది.

ఇక్కడే అధికం

రాష్ట్రంలో అత్యధిక మద్యం విక్రయాలు జిల్లాలోనే జరుగుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక మద్యం విక్రయాలు పెరిగాయి. ప్రస్తుతం ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న 161దుకాణాల ద్వారా రోజుకి రూ.4కోట్ల అమ్మకాలు జరుగుతున్నాయి. ఒక్కో షాపులో రూ.2లక్షలు మేర విక్రయాలు జరుగుతున్నాయి. అత్యధికంగా పిన్నింటిపేటలో రూ.5.50లక్షలు మేర విక్రయాలు జరగ్గా, దాని తర్వాత స్థానంలో కోటబొమ్మాళి, పొందూరు, కళింగపట్నం, భావనపాడు, సోంపేట తదితర దుకాణాల్లో అత్యధిక విక్రయాలు జరుగుతున్నాయి. ఈ విక్రయాలు మరింత పెంచేలా, భారీగా లాభాలు ఆర్జించేలా ప్రైవేటు దుకాణాల కోసం తెలుగు తమ్ముళ్లు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పుడున్న దుకాణాల సంఖ్య ప్రైవేటు పాలసీలో మరింత పెరుగుతాయని, ఆ మేరకు దుకాణాలను దక్కించుకునే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ లాబీయింగ్ ఓ మంత్రి సోదరుడి కనుసన్నల్లోనే జరుగుతోంది.

మంత్రి సోదరుడి కనుసన్నల్లో..



జిల్లా వ్యాప్తంగా మద్యం వ్యాపారులకు సంకేతాలు వెళ్లిపోయాయి. ఎవరైనా తనను సంప్రదించాల్సిందేనని, వ్యాపారం చేయాలంటే తాను చెప్పినట్టు నడుచుకోవల్సిందేనని, తాను చెప్పిన సిండికేట్‌లోనే ఏ వ్యాపారైనా ఉండాలని మంత్రి సోదరుడు తేల్చిచెప్పేశారు. దీంతో మద్యం వ్యాపారంపై ఆసక్తి ఉన్న వారంతా ఆయన్ని సంప్రదించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో ఆమదాలవలస నియోజకవర్గంలో తప్ప మిగతా అన్ని చోట్ల ఆ మంత్రి సోదరుడి కనుసన్నల్లోనే లిక్కర్ బిజినెస్ జరిగేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రెండు రోజుల్లో పాలసీ రాగానే తమ వ్యూహాలు అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆ మంత్రి సోదరుడికి కుడి, ఎడమ భుజాలుగా రమేష్, హరి అనే వ్యక్తులు వ్యవహరిస్తున్నారు. వీరి ద్వారా వ్యవహారాలను చక్కబెడుతున్నారు. లాటరీలో షాపులు ప్రకటించే లోపు తమ టార్గెట్ చేరుకునేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఒక్కో షాపునకు ముట్టజెప్పాల్సిన పైకాన్ని కూడా నిర్దేశించినట్టు తెలిసింది. ప్రస్తుతం జిల్లాలో దుకాణాల కోసం పైరవీలే కనబడుతున్నాయి.

235 దుకాణాలకు అవకాశం

2014–19లో జిల్లాలో 235 ప్రైవేటు దుకాణాలుండగా, ఇప్పుడా సంఖ్యను పెంచే ప్రయత్నం జరుగుతోంది. ఒక్కో దుకాణం రూ. 50లక్షల నుంచి రూ. 85లక్షల వరకు ఫీజు నిర్దేశించే అవకాశం ఉంది. ఈ ఫీజు పెరిగే అవకాశం కూడా ఉంది. జిల్లాకొక ప్రీమియం దుకాణం కూడా ఏర్పాటు చేయనున్నారు. దాని విలువ రూ. కోటికి పైగా ఉండనుంది. వీటికి సంబంధించి ఇప్పటికే ఎక్సైజ్ అధికారులను ప్రభుత్వం సమాచారం అడిగినట్టు తెలిసింది. ప్రభుత్వం చేస్తున్న సన్నాహాలు చూస్తుంటే 2014–19కన్న ఎక్కువ షాపులుండే అవకాశం ఉంది. ఇప్పుడున్న ప్రభుత్వ దుకాణాల స్థానంలోనే ప్రైవేటు షాపులు కొనసాగించేలా ఏర్పాట్లు కూడా చేస్తోంది.

సంపద పెంచుకునే ప్లాన్

మద్యం వ్యాపారులకు కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రైవేటు పాలసీ కాసులు కురిపించనుంది. అధికారం చేతిలో ఉండటం, అధికారులు కూడా చెప్పినట్టుగా నడుచుకునే అవకాశం ఉండటంతో గత టీడీపీ ప్రభుత్వంలో నడిచిన మద్యం దందాను మళ్లీ కొనసాగించేందుకు తెలుగు తమ్ముళ్లు ఉత్సుకతతో ఉన్నారు. సంపాదించుకోవడానికి మంచి అవకాశమని మద్యం దుకాణాలపై దృష్టి పెట్టారు. ఇదే అవకాశంగా తీసుకుని ఓ మంత్రి సోదరుడు లిక్కర్ బిజినెస్‌కు నాయకత్వం వహించే పనిలో పడ్డారు.

కార్పొరేషన్ ఏర్పాటుకు వినతి

నరసన్నపేట: రాష్ట్రంలో పారామిలటరీ సైనికులకు కూడా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం ప్రతినిధులు మంత్రి అచ్చెన్నాయుడును కోరారు. నిమ్మాడలో సోమవారం మంత్రిని కలిసి వినతి పత్రం ఇచ్చామని పారామిలటరీ అసోషియేషన్ ప్రతినిధులు కె.రామారావు, యాళ్ల అప్పలనాయుడు, పి. తిరుపతిరావు తెలిపారు. అలాగే పారామిలటరీ బలగాల్లో పనిచేస్తున్న, విరమణ పొందిన సైనికుల కోసం కేంద్ర ప్రభుత్వం ఆస్పత్రులు నెలకొల్పాలని కోరామన్నారు. ఇతర సమస్యలు కూడా మంత్రికి వివరించినట్లు తెలిపారు.

బాణాసంచా తయారీ, విక్రయాలకు అనుమతులు తప్పనిసరి



శ్రీకాకుళం క్రైమ్ : దీపావళి పండగ నేపథ్యంలో బాణసంచా పేలుళ్లు జరగకుండా జిల్లావ్యాప్తంగా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ్ జట్టి ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదలైంది. బాణసంచా నిల్వలు, విక్రయాలు, తయారీకి అనుమతులు ఉన్న గోడౌన్లు, షాపుల వద్ద భద్రతా ప్రమాణాలు, రక్షణ చర్యలు పరిశీలించాలన్నారు. ఇతర శాఖల అధికారులతో జాయింట్ తనిఖీలు నిర్వహించి అనుమతులు లేనివాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనధికారికంగా ఉండేవాటిని ముందుగా గుర్తించి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేయాలన్నారు.

జిల్లాలో మళ్లీ వానలు


ఎల్ఎన్ పేటలో వాన

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో మళ్లీ వానలు కురుస్తున్నాయి. ఈ నెలలో మొదటి, రెండో వారాల్లో ఎక్కువగా వర్షాలు పడ్డాయి. అయితే ఇప్పుడిప్పుడే వర్షాల నుంచి ప్రజలు, రైతులు తేరుకుంటున్నారు. మళ్లీ వర్షాలు రావడంతో ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడడం వల్ల జిల్లా అంతటా సోమవారం వర్షాలు కురిశాయి.

ప్రభాస్ స్కూలుకెళ్లాడు..



గొర్రెలు మేపుతున్న విద్యార్థి నర్తు ప్రభాస్



ప్రభాస్‌ను బడిలో చేర్చుకుంటున్న హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయక్

ఇచ్ఛాపురం రూరల్: బతుకు తెరువు కోసం ఏడో తరగతిలో బడి మానేసి గొర్రెలు కాయడానికి వెళ్లిన నర్తు ప్రభాస్ ఎట్టకేలకు బడి బాటపట్టాడు. కొళిగాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేంద్రనాథ్ పట్నాయక్ విద్యార్థి కుటుంబ సభ్యులతో మాట్లాడి, ఇంట్లో నచ్చజెప్పడంతో సోమవారం అమ్మమ్మతో కలసి ప్రభాస్ బడికి వచ్చాడు.

ప్రజల పక్షాన పోరాడదాం



ఆమదాలవలసలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను కలిసి అభినందిస్తున్న ధర్మాన కృష్ణదాస్

ఆమదాలవలస:

మాజీ స్పీకర్, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు తమ్మినేని సీతారాంను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆమదాలవలసలో సోమవారం కలిశారు. కొత్త బాధ్యతలను స్వీకరించినందుకు అభినందనలు తెలిపారు. రానున్న నాలుగున్నరేళ్లలో ఐకమత్యంగా పనిచేద్దామని, ప్రజల పక్షాన పోరాడదామని తమ్మినేని పిలుపునిచ్చారు.

శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ తరఫున తమ్మినేని అందించే సేవలు చరిత్ర సృష్టిస్తాయని కృష్ణదాస్ అన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు కరిమి రాజేశ్వరరావు, నరసన్నపేట ఎంపీపీ అరంగి మురళి, నరసన్నపేట మండల పార్టీ అధ్యక్షులు లుకలాపు రవి, పొందర కుల అధ్యక్షులు ఆర్.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్ నిల్


పనులు పూర్తి అయ్యి ప్రారంభంకాని కేరాసింగి కొండపై నిర్మించిన టవర్..

- గిరిశిఖర గ్రామాలకు అందని నెట్‌వర్క్
- ప్రారంభం కాని సెల్ టవర్లు

మెళియాపుట్టి: జిల్లాలోని ఎత్తైన గిరి శిఖర గ్రామాలకు నేటికీ సెల్‌ఫోన్ సిగ్నళ్లు రావడం లేదు. మరీ ముఖ్యంగా మెళియాపుట్టి, కొత్తూరు మండలాల్లో చాలా గ్రామాలు నెట్‌వర్క్‌కు దూరంగా ఉన్నాయి. వాస్తవానికి మెళియాపుట్టి మండలంలో 18 టవర్లు, కొత్తూరులో 8 టవర్లను నిర్మించారు. కానీ వాటిలో ఒకటి రెండు మాత్రమే ప్రారంభమయ్యాయి. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. అయితే ప్రారంభమైన టవర్ల నుంచి కూడా సరిగా సిగ్నల్ రావడం లేదని గిరిజనులు వాపోతున్నారు. టవర్లు నిర్మించి వాటికి సంబంధించిన సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటులో అధికారులు విఫలమయ్యారు. ఇటీవల కేరాసింగిలో పర్యటించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌కు కూడా స్థానికులు ఈ విషయాన్ని చెప్పారు. మెళియాపుట్టి మండలకేంద్రానికి నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న దీనబంధుపురం, కుడ్డబ, గేదెల పోలూరు, చింతలపోలూరు అలాగే రామచంద్రాపురం, కొత్తూరు, చందనగిరి, గూడ, కేరాసింగికి నెట్‌వర్క్ అందడం లేదు.


కుడ్డబ గ్రామంలో సిగ్నల్‌కోసం ప్లాస్టిక్ బాటిల్‌లో వేలాడదీసిన ఫోన్ చూపిస్తున్న గ్రామస్తుడు

టవర్ నిర్మించారు సిగ్నల్ లేదు



మా గ్రామానికి నెట్‌వర్క్ రాదు. అత్యవసర సమయాల్లో మాకు ఏ సమాచారం అందదు. టవర్లు ఏర్పాటు చేసినా సిగ్నళ్లు రావడం లేదు. మా కష్టాలు ఎప్పటికి తీరుతాయో.

– పదాల సంజీవరావు, రింపి, మెళియాపుట్టి మండలం

రేషన్ సరుకులకు కిందకే వెళ్తాం



మా ఊరు కేరాసింగి కొండమీదే ఉంటుంది. ఇక్కడ ఫోన్లు కూడా పనిచేయవు. ప్రతి నెలా నడుచుకుంటూ కింద గొద్ద గ్రామానికి వెళ్లి కాలినడకన వెళ్లి రేషన్ తెచ్చుకుంటాం.

– పోలమ్మ, కేరాసింగి గిరిశిఖర గ్రామం, మెళియాపుట్టి మండలం

త్వరలోనే టవర్లు ప్రారంభిస్తాం

మెళియాపుట్టి మండలంలో చాలావరకు టవర్లు ప్రారంభించడానికి కసరత్తు పూర్తి చేశాం. దీనబంధుపురంలో ప్రారంభించాం. సిగ్నల్ కొంచెం డెవలప్ కావాలి. త్వరలోనే కేరాసింగి కొండపై ఉన్న టవర్ కూడా ప్రారంభిస్తాం. – బి.పవన్, బీఎస్ఎన్ఎల్ అధికారి, పాతపట్నం

క్లుప్తంగా

అరసవల్లి ఆలయ సూపరింటెండెంట్‌గా కనకరాజు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి డిప్యూటీ కమిషనర్ క్యాడర్ స్ట్రెంత్ ప్రకారం కీలక పోస్టుల భర్తీకి దేవదాయ శాఖ చర్యలు చేపట్టింది. ఈ మేరకు సాధారణ బదిలీల్లో భాగంగా స్థానిక ఆలయానికి సూపరింటెండెంట్‌గా ఎస్.కనకరాజు నియమితుల య్యారు. ఈయన సింహాచలం దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు రానున్నారు. ఈయనతో పాటు విజయన గరం మాన్సాస్ ట్రస్ట్‌లో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న ఆట్టాడ శ్రీనివాసరావును, సింహాచలం దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎ.శోభనాద్రచార్యులును కూడా అ ర సవల్లిలో ఆలయ సీనియర్ అసిస్టెంట్లుగా నియమించారు. అలాగే స్థానిక ఆలయంలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తికి విజయనగరం మాన్సాస్ ట్ర స్టుకు, మరో జూనియర్ అసిస్టెంట్ వై.శ్యామలరావుకు సింహాచలం దేవస్థానానికి బదిలీ చేశారు.

యోగి లక్ష్మి నేత్రాలు సజీవం


నేత్రదాత యోగి లక్ష్మి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని హడ్కోకాలనీలో నివాసం ఉంటున్న కొల్లూరు యోగి లక్ష్మి అనారోగ్య కారణంగా ఆదివారం మృతి చెందారు. మరణానంతరం ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసేందుకు ముందుకువచ్చారు. రెడ్‌క్రాస్‌ను సంప్రదించగా సంబంధిత సిబ్బంది వచ్చి కార్నియాలను సేకరించారు. వీటిని విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందచేశారు. నేత్రదానం చేయాల నుకునేవారు 7842699321 నంబరుకు కాల్‌చేయాలని రెడ్‌క్రాస్ సిబ్బంది కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: అక్టోబర్ 1వ తేదీ నుంచి కొత్త మద్యం విధానం అమల్లోకి వస్తున్న నేపథ్యంలో జిల్లాలోని 193 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఎచ్చెర్లలో వీరు సోమవారం తమ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఎచ్చెర్ల బేవరేజెస్ కార్పొరేషన్ గోదాం ముందు నిరసన తెలియజేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న వారి కుటుంబాలు రోడ్డున పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సేల్స్‌మెన్, సూపర్‌వైజర్ల చలో డిపో

శ్రీకాకుళం క్రైమ్ : అక్టోబరు 1 నుంచి నూతన మద్యం విధానం ప్రభుత్వం అమలు చేస్తున్న కారణంగా తమ ఉద్యోగానికి భద్రత కల్పించాలంటూ జిల్లాలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు నేడు చలో డిపో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఏపీఎస్‌బీసీఎల్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.

కబేళాకు గేదెలు తరలిస్తున్న ఐదుగురు అరెస్టు


గోశాల వద్ద పోలీసులు

కాశీబుగ్గ: పలాస జాతీయ రహదారిపై అక్రమంగా కబేళాకు తరలిస్తున్న పశువులను కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే కొర్లాయిగేటు నుంచి విశాఖపట్నం వైపు పలాస మీదుగా ఐదు బొలేరా వాహనాల్లో పదహారు గేదెలను అక్రమంగా తరలిస్తుండగా సోమవారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. గేదెలు తరలిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సీఐ మోహనరావు కేసు నమోదు చేసి మూగజీవాలను కొత్తవలసలోని గోశాలకు తరలించారు.

29న జిల్లా యోగాసన పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన నిర్వహిస్తున్న జిల్లాస్థాయి యోగాసన పోటీలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ ప్రతినిధులతో కలిసి సమావేశమయ్యారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో జరగను న్న ఈ ఈ యోగాసనాల ప్రక్రియ ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మొదలవుతుందన్నారు. 10 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన వారిని అక్టోబర్ 5, 6 తేదీల్లో కర్నూలు జిల్లా వేదికగా జరిగే రాష్ట్రపోటీలకు పంపిస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగినవారు 96764 72733, 94922 66889, 94911 54156 నంబర్లనుసంప్రదించాలని జిల్లా యోగాసన స్పో ర్ట్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కేదార్‌నాథ్ పేర్కొన్నారు.

ఈ-ఐ కేంద్రాలకు తాళాలు

- జిల్లాలో నిలిచిపోయిన కంటి వైద్యం
- సీహెచ్‌సీల వద్ద వెనుదిరుగుతున్న నిరుపేదలు
- ఉచిత కంటిపరీక్షలు, కళ్లద్దాల పంపిణీకి మంగళం


కంటిని పరీక్షిస్తున్న నిపుణులు


పలాస సీహెచ్‌సీలో మూసివేసిన కేంద్రం

కాశీబుగ్గ: గ్రామీణ ప్రాంత ప్రజలకు, పట్టణ ప్రాంతంలో నిరుపేదలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందించే ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలకు కూటమి ప్రభుత్వం తాళాలు వేసింది. ఓ వైపు తమది మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటూనే పేదలకు ఉపయోగపడే ఇలాంటి కేంద్రాలను కనికరం లేకుండా మూసివేస్తోంది.

నిలిచిపోయిన సేవలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ సామాజిక ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల్లో ప్రజలకు సేవలు నిలిచిపోయాయి. ముఖ్యంగా ఆప్తమాలజిస్టు, అసిస్టెంట్, ఎక్విప్‌మెంట్ అసిస్టెంట్లు ఉండేవారు. 60 ఏళ్లలోపు వారందరికీ శుక్లాలు, దృష్టిలోపం వంటి వివిధ కంటి వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించేవారు. చక్కెర వ్యాధి గ్రస్తులకు అతి ఖరీదైన పండస్ రెటినో పరీక్షలను నిర్వహించి ఫలితాలను ఆయా ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల్లో తెలియజేసేవారు. ప్రస్తుతం వాటికి మంగళం పాడేశారు.

అత్యాధునిక మిషనరీలు సైతం..

ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో కేవలం ఓపీలో ఆధార్ కార్డుతో నమోదు చేసిన ఆధారంగా కంటి సమస్యలు ఉన్నవారికి ఐడీని క్రియేట్ చేసి కంటి సమస్యతో బాధపడుతున్నవారికి ఉచితంగా కంటి పరీక్షలు చేపట్టేవారు. రూ.8లక్షలకుపైగా విలువైన రెండు మిషనరీలు అందుబాటులో ఉండేవి. ఆటో రిఫ్లెక్షన్ మిషన్, రెటీనా పరీక్షల మిషన్‌తో ఇక్కడ రెటీనా పరీక్షలు ఉచితంగా చేసేవారు. ఇదే మిషనరీ సేవలకు ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.4వేలు వరకు తీసుకుంటారు.

ఉచితంగా అద్దాలు లేనట్టేనా..?

రేషన్ కార్డుతో అవసరం లేకుండా కేవలం ఆధార్ కార్డు ప్రాతిపదికన ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల్లో 60 ఏళ్లలోపు వారికి కంటి వైద్య పరీక్షలు చేయడంతో పాటు దృష్టిలోపం ఉన్న వారికి ఖరీదైన ఫైబర్ కళ్లద్దాలను అందజేసేవారు. ఆ వ్యక్తి రంగును ఎంచుకునే సౌకర్యంతో కంటి అద్దాలు, అద్దాలకు ఉండే ఫ్రేమ్‌ను పొందగలిగే చాన్సు ఉండేది. ఉచిత పరీక్షలు ప్రభుత్వ సెలవు దినంలో తప్ప అన్ని రోజులు లభించేవి. పాఠశాలలో చిన్నారులకు సైతం పరీక్షలు చేపట్టి వారికి ఉచిత కళ్లద్దాలను ఈ కేంద్రాల నుంచి పంపించేవారు. పరీక్షలలో భాగంగా ఆపరేషన్ అవసరం ఉన్నవారికి ఎన్‌జీఓల ఆధ్వర్యంలో ఉచితంగా నాణ్యమైన ఆపరేషన్‌లు చేయించేవారు. ముఖ్యంగా శుక్లాల ఆపరేషన్, టెరిజం(పొర) ఆపరేషన్‌లు ఉచితంగా రిమ్స్‌లో సేవలు అందించేవారు. ఇవే కాకుండా ప్రభుత్వ నుంచి మల్టీ విటమిన్ టాబ్లెట్‌లు, సిప్రాప్లాక్స్ చుక్కలు మందు (ఐ-డ్రాప్స్)లు అందించేవారు. ఆ సేవలన్నీ ఇప్పుడు ఆపేశారు.

మూతబడిన సెంటర్లు ఇవే..

పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి, ఇచ్ఛాపురం, పాతపట్నం, రణస్థలం, ఆమదాలవలసలలో ఉన్న ప్రభుత్వ సామాజిక ఆస్పత్రుల్లో ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాకతో మూసివేశారు.

అగ్రిమెంట్ పూర్తయ్యింది..



పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ఉన్న ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలు మూసివేయడం వాస్తవమే. ఎందుకంటే అపోలో సంస్థతో అగ్రిమెంట్ ఉండేది. అందుకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో వారు తెచ్చుకున్న మిషనరీలతో అన్ని రకాల కంటి పరీక్షలు నిర్వహించేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అగ్రిమెంట్ పునరుద్ధరిస్తే తిరిగి ప్రారంభిస్తారు.

– డాక్టర్ తమ్మినాన పాపినాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి, పలాస

ఉత్సాహంగా స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు


తైక్వాండో ఎంపికల్లో క్రీడాకారుల విన్యాసం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపికలు ఆద్యంతం ఉత్సాహంగా సాగుతున్నాయి. మలివిడత షెడ్యూల్‌లో భాగంగా తొలిరోజు ఆదివారం బాక్సింగ్ ఎంపికలు పూర్తికాగా.. రెండోరోజు సోమవారం స్విమ్మింగ్, తైక్వాండో, ఫెన్సింగ్, టెన్నీకాయిట్ క్రీడాంశాల్లో సాగాయి. ఇందులో స్విమ్మింగ్ ఎంపికలు శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్ వేదికగా జరిగాయి. ఫెన్సింగ్, తైక్వాండో ఎంపికలు శ్రీకాకుళం నగరంలోని టౌన్‌హాల్ వేదికగా సాగాయి. అలాగే టెన్నీకాయిట్ ఎంపికలు పలాసలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానం వేదికగా జరిగాయి. ఎంపికైన క్రీడాకారుల జాబితాలను త్వరలో వెల్లడించనున్నట్టు ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు పేర్కొన్నారు. అయితే పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు భోజనాలు లేకుండా ఆకలితో అలమటిస్తుండటంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కడలి కల్లోలం


అక్కుపల్లి శివసాగర్ తీరంలో ఎగసిపడుతున్న కెరటాలు

వజ్రపుకొత్తూరు రూరల్: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కడలి కల్లోలంగా మారింది. అక్కుపల్లి శివసాగర్, గుణుపల్లి, మొట్టూరు, నువ్వలరేవు తీరాల్లో సోమవారం సముద్ర కేరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ తీరం వైపు దూసుకువచ్చాయి. దీంతో మత్స్యకారులు ఆందోళన చెందారు. కాగా సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో పెను మార్పులు సంభవించాయి. దీంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వర్షపు నీరు రోడ్లపైకి చేరడంతో రోడ్లు జలమయం అయ్యాయి.

మారేడుమిల్లి ఘటనలో టెక్కలి విద్యార్థికి తీవ్ర గాయాలు

టెక్కలి: మారేడుమిల్లిలో విహారయాత్రకు వెళ్లి జల తరంగిణి జలపాతంలో గల్లంతైన మెడికల్ విద్యార్థుల్లో టెక్కలికి చెందిన విద్యార్థి సీహెచ్ హరిణిప్రియ తీవ్రంగా గాయపడింది. విద్యార్థిని ప్రస్తు తం రాజమండ్రిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన రాజమండ్రి బయల్దేరారు. ప్రస్తుతానికి విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

వంద రోజుల పాలనలో రాష్ట్రం అధోగతి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

- ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం రూరల్: వంద రోజుల కూటమి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని ఎమ్మెల్సీ నర్తు రామారావు విమర్శించారు. ఇచ్ఛాపురంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అమలు చేస్తామంటూ చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ పథకాలకు తిలోదకాలిచ్చారని మండిపడ్డారు. జనం నిలదీస్తారనే భయంతోనే రాజపురం రాకుండా తప్పించుకున్నారని అన్నారు. వైఎస్ జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక పరమ పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డూపై విషం చిమ్ముతూ అనుకూల మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమావేశంలో ఎంపీపీ బోర పుష్ప, మండల, పట్టణ పార్టీ కన్వీనర్‌లు పాతిర్ల రాజేఖరరెడ్డి, బి.ప్రకాశరావు పట్నాయక్, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, మాజీ జెడ్పీటీసీ దక్కత సూకయ్య రెడ్డి, పిలక సంతూ, సర్పంచ్‌లు కారంగి త్రినాథ్, దుక్క ధనలక్ష్మి, పిట్ట మామయ్యరెడ్డి, సంతోష్ మండల, నీలాపు సారథి, గుజ్జు ఢిల్లీరావు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి సల్ల దేవరాజు, ఆశి పురుషోత్తం, ఆశి కృష్ణారెడ్డి, రాంపల్లి చిట్టిబాబు, తిప్పన నాగరాజు, వలసయ్య, దుక్క ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి


ధనుంజయరావు (ఫైల్)


చిన్నారులతో మృతుడి తల్లి, భార్య

జి.సిగడాం: జీవనోపాధి కోసం గుంటూరుకు బయల్దేరిన వ్యక్తి ప్రయాణం మధ్యలోనే ఆగిపోయింది. కుటుంబ పోషణ కోసం వెళ్లిన వ్యక్తి రైలు ప్రమాదంలో చనిపోయారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఆనందపురం గ్రామానికి చెందిన డొప్ప ధనుంజయరావు (26) సోమవారం గుంటూరు వెళ్లడానికి విజయనగరం జిల్లా చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. రైలెక్కిన కాసేపటికే నెల్లిమర్ల చంపావతి వంతెన దగ్గర రైలు నుంచి కాలుజారి పడిపోయి మృతి చెందాడని తోటి వలస కూలీలు పోతురాజ నారాయణరావు మృతుడి కుటుంబానికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు సంఘటన స్థలానికి వెళ్లారు. మృతుడికి భార్య మంగమ్మ, రెండేళ్ల పాప నిచిత, ఆరునెలల బాబు విరాట్ ఉన్నారు. ధనుంజయరావు మృతి చెందడంతో ఆనందపురం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించాక గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. వీరిది సామాన్య కుటుంబమని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కలెక్టర్ చేతికి విచారణ నివేదిక

- రిమ్స్‌కు వెళ్లి బాధితురాలిని విచారించిన విచారణాధికారి శ్రీకాంత్
- కీలక ఉద్యోగికి రూ.లక్ష ఇచ్చినట్లుగా చెప్పిన బాధితురాలు



అరసవల్లి: వైద్య శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఓ మహిళను మోసం చేసిన కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ జీవీ నరసింహం వ్యవహారం సోమవారం కీలక మలుపునకు చేరుకుంది. ఈ మేరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న నరసింహం (సింహం)పై ఓ వైపు పోలీసులు కేసు నమోదు చేయగా.. మరో వైపు శాఖాపరంగా వైద్యారోగ్య శాఖాధికారులు కూడా విచారణను సోమవారం వేగవంతం చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి ఆదేశాల మేరకు అడిషనల్ డీఎంహెచ్‌ఓ తాడేల శ్రీకాంత్ విచారణాధికారిగా, స్థానిక ఏఓ బాబూరావుతో కలిసి నేరుగా రిమ్స్‌లో వార్డులో చికిత్స పొందుతున్న బాధితురాలిని సోమవారం మధ్యాహ్నం కలిసి వాంగ్మూలాన్ని రికార్డు చేసుకున్నారు. అంతకుముందే జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి కూడా బాధితురాలిని రిమ్స్‌లో కలిసి జరిగిన వ్యవహారంపై ఆరా తీశారు. విచారణాధికారి ఎదుట జరిగిన అన్యాయాన్ని వివరంగా తెలియజేయాలంటూ సూచించారు. డాక్టర్ శ్రీకాంత్, ఏఓ బాబూరావులు బాధితురాలి నుంచి వాస్తవాంశాలను రాబట్టి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. ఈ విచారణ నివేదికను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి మీనాక్షికి, అక్కడ నుంచి పూర్తి నివేదికను కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు, అలాగే వైద్య శాఖ రీజనల్ డైరెక్టర్‌కు సమర్పించనున్నారు.

కీలక ఉద్యోగికి రూ.లక్ష

ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసాలు చేస్తున్న వ్యవహారాలపై 'సాక్షి' ప్రచురిస్తున్న వరుస కథనాలు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. దీనికి తోడు బాధితురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం ఈ కేసు తీవ్రతను మరింత పెంచింది. అయితే బాధితురాలు సోమవారం విచారణాధికారికి తెలియజేసిన వివరాలను బట్టి చూస్తే కొత్త కొత్త విషయాలు, అక్రమ దందా వ్యవహారాలు బయటకు వస్తున్నాయి. బాధితురాలు చెప్పిన వివరాల మేరకు ఫేక్ జాయినింగ్ ఆర్డర్ ఇచ్చి మోసం చేసిన జీవీ నరసింహంకు తాను డేటా ఎంట్రీ ఆపరేటర్ (డిఈవో) పోస్టు కోసం రూ.2 లక్షలు ఇచ్చానని, అలాగే ఆయన సూచన మేరకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కీలకంగా పనిచేస్తున్న ఓ కీలక అధికారికి కూడా రూ.లక్ష నగదును తాను స్వయంగా ఇచ్చానని చెప్పడం సంచలనమైంది. అలా డబ్బులివ్వడంతోనే ఆ కీలకాధికారి తన ఉద్యోగానికి భరోసా ఇచ్చినట్లుగా స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు బాధితురాలు తెలియజేశారు.

ఇదే ఇప్పుడు కీలకంగా మారనుంది. అసలు బాధితులు ఎంతమంది ఉన్నారో అన్న సంగతి సమగ్ర విచారణతో బయటకొచ్చే అవకాశాలున్నాయి. అసలు విచారణలో ఇదే కీలకం కానుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా


జెడ్పీ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ సభ్యులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ మాట్లాడుతూ విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను కొనసాగించాలని, ఇప్పటి వరకు చెల్లించాల్సిన రూ. 3480 కోట్లు తక్షణమే విద్యార్థులకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 77 రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్ల బకాయిలు క్లియర్ చేయాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలని కోరారు. పొందూరు డిగ్రీకాలేజీకి సొంత భవనం కట్టాలన్నారు. శ్రీకాకుళం మహిళా డిగ్రీ కాలేజీలో దోమల బెడద ఎక్కువగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, గర్ల్స్ కన్వీనర్ పవిత్ర, జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్ రాజు ఈ దుర్గాప్రసాద్ నాయకులు కుసుమ దియా పాల్గొన్నారు.

నిలిచిపోయిన మద్యం లారీలు


ఎచ్చెర్లలో ఏపీ బేవరేజెస్ గోదాం ముందు నిలిచి పోయిన లారీలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ గోదాం ముందు మద్యం లారీలు నిలిచి పోయాయి. ప్రస్తుతం లోడింగ్, అన్‌లోడింగ్ నిలిపివేశారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి ప్రైవేట్ మద్యం విధానాన్ని ప్రభుత్వం తీసుకురానుంది. జిల్లాలో ఉన్న 193 మద్యం ప్రభుత్వ దుకాణాలు సెప్టెంబర్ 30 నుంచి ఉండవు. దీంతో ముందుగానే ఈ నెల 18వ తేదీ నుంచి ప్రభుత్వ దుకాణాలకు మద్యం సరఫరా నిలిపివేశారు. మరోపక్క గోదాం నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలను టాన్స్‌పోర్ట్ చేసే వాహనాలకు సైతం గత కొన్ని నెలల నుంచి రవాణా ఖర్చులు అందజేయలేదు. ప్రస్తుతం మద్యం దుకాణాల్లో మద్యం కొరత వెంటాడుతోంది. జిల్లాలో 23 ప్రైవేట్ బార్లు ఉన్నాయి. ఈ బార్లు 2025 సెప్టెంబర్ వరకు కొనసాగనున్నాయి. బార్లకు మాత్రం మద్యం అందజేస్తున్నారు. లోడింగ్ జరగకపోవటం వల్ల లారీలకు మద్యం కంపెనీలు రోజువారీ కిరాయి అందజేయాల్సి ఉంటుంది. ఉండడానికి కూడా సదుపాయాలు లేకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు.

కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్


గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గతంలో వచ్చిన 6,100 పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్ భర్తీకి ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. సోమవారం శ్రీకాకుళం పట్టణంలోని గాంధీ పార్కు నుంచి జిల్లా పరిషత్ వరకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రామన్న మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన 6,100 పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో 95,208 మంది ప్రాథమిక రాత పరీక్ష రాసి అర్హత సాధించి ఉన్నారని తరువాతి పరీక్షలు వేగంగా నిర్వహించాలన్నారు.

హోంగార్డుల రిజర్వేషన్లపై పునరాలోచన చేయాలన్నారు. దీని వల్ల జనరల్ అభ్యర్థులు నష్టపోతారని తెలిపారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మీకోసంలో అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఎస్.శ్రవణ్ కుమార్, మౌనిక, గణేష్, చంటి, హదీష్ తదితరులు పాల్గొన్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం


మాట్లాడుతున్న సీఐ మీసాల చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి గుంటూరుకు అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఒడిశా వ్యక్తి పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ విషయమై స్థానిక సీఐ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. సీఐ మీసాల చిన్నంనాయుడు మాట్లాడుతూ ఒడిశాలోని గంజాం జిల్లా, పొలసర బ్లాక్ ఖండూరుకి చెందిన శంకర్‌సాహు ఆదివారం సాయంత్రం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో గల ఎల్‌సీ గేట్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టణ పోలీసులు తనిఖీ చేశారని, తనిఖీలో అతని వద్ద గల బ్యాగులో 10.470 కేజీల గంజాయిని గుర్తించారని తెలిపారు. అనంతరం గంజాయిని స్వాధీనం చేసుకుని అతడి సెల్‌ఫోన్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

సబ్జెక్టు కాంట్రాక్టు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి తాత్కాలిక పద్ధతిలో సబ్జెక్టు కాంట్రాక్ట్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ పి.సుజాత సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీన 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇంజినీరింగ్ సీఎస్ఈలో 3, ట్రిపుల్ ఈలో 3, మెకానికల్‌లో 1, సివిల్‌లో రెండు, పీజీ కోర్సుల్లో ఫిజిక్స్‌లో 2, మైక్రో బయోలజీలో 1, రూరల్ డెవలప్‌మెంట్‌లో 1, ఎంఎల్ఐఎస్సీలో 1, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో 1, ఐటెప్‌లో 1, సోషల్ వర్క్‌లో 1, డీసీఎంఎస్‌లో 1, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో 2, అనలిటికల్ స్కిల్స్‌లో ఒకటి, సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనర్ 1 ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏయూ.ఈడీయు.ఐఎన్ వెబ్ సైట్‌లో పొందుపర్చినట్లు చెప్పారు.

గురుకులంలో పోషణ్ అభియాన్


గురుకుల పాఠశాలలో కూరగాయలతో వేసిన ఇండియా

పాతపట్నం: ప్రహరాజపాలేంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం ప్రిన్సిపాల్ వి.అర్చన ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలతో బొమ్మలు వేసి విద్యార్థులు ప్రదర్శించారు. భారతదేశ చిత్రపటం ఆకట్టుకుంది.

ఆక్రమణలు తొలగించాలని ఆందోళన

శ్రీకాకుళం పాతబస్టాండ్: బూర్జ మండలం కాలపర్తి పంచాయతీ పరిధిలో గల సర్వే నంబరు 452–1,2,3,4లో సుమారుగా 2.64 ఎకరాలు ఆక్రమించాలని చూస్తున్నారని, దాన్ని అడ్డుకోవాలని జిల్లా దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జెడ్పీ వద్ద వారు ధర్నా చేశారు. అదే గ్రామానికి చెందిన రైతులు తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

స్టేట్ పోటీలకు జలుమూరు కేజీబీవీ విద్యార్థినులు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

జలుమూరు: తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలకు జలుమూరు కేజీబీవీ విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వై.యశోద సోమవారం తెలిపారు. జలుమూరు కేజీబీవీ నుంచి పది మంది విద్యార్థినులు వెళ్లగా అండర్–17 విభాగంలో ఎస్.హేమలత, కె.జ్ఞానేశ్వరి, అండర్–19 విభాగంలో శ్రీవల్లి ఎంపికయ్యారు. వీరి ఎంపికకు కృషి చేసిన పీఈటీ నీరజను అభినందించారు.